ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 21 నవంబరు 2025





సత్యసాయి మహాసమాధి వద్ద ప్రణమిల్లిన రష్యా ప్రతినిధులు





సత్యసాయి మహాసమాధికి పూలమాల వేస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, పక్కనే ఆర్‌జే రత్నాకర్

నిస్వార్థ సేవాదళ్..!

అవసరమైనచోట అండగా నిలుస్తారు.. అసౌకర్యాల నడుమ సేవలు అందిస్తారు

- సత్యసాయి బోధనలతో భక్తుల సేవామార్గం
- కొనియాడిన కేంద్ర మంత్రి గడ్కరీ, ట్రస్టు ప్రతినిధులు
- ప్రశాంతి నిలయంలో సత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సు
- 45 దేశాల నుంచి 2500 మంది ప్రతినిధుల హాజరు



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఆశీర్వదిస్తున్న పండితులు,



సాయికుల్వంత్ హాలులో ప్రదర్శనగా వస్తున్న వివిధ దేశాల ప్రతినిధులు

పుట్టపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలకు సత్యసాయి సేవాదళ్ నిదర్శనమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు, ప్రతినిధులు కొనియాడారు. సత్యసాయి బోధనలే వారిని సేవామార్గంలో నడిపిస్తున్నాయని అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు మందిరంలో గురువారం శ్రీసత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు రత్నాకర్, చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి విద్యార్థుల వేద పఠనంతో కార్యక్రమం మొదలైంది. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి గడ్కరీ, మొదట సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం సద స్సులో ప్రసంగించారు. సత్యసాయి జీవితం, బోధనలు, విలువలు, ప్రేమతత్వం, మానవాళిని శాంతిజీవనం వైపు నడిపిస్తున్నాయని అన్నారు. ఇక్కడి భక్తి, సేవలను చూసి.. మరిన్ని మంచి పనులు చేసేందుకు ప్రేరణ పొందాలని వచ్చానని తెలిపారు.

సేవాదళ్‌కు ముఖ్యమైన సదస్సు..

భగవాన్ సత్యసాయిబాబా అందించిన సేవ, ప్రేమ, స్ఫూర్తితో సేవాదళ్


(మిగతా 6లో..)



సత్యసాయి మహాసమాధి వద్ద మంత్రి సవిత, ఎమెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రణామం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ట్రస్టు సభ్యులు



సాయి కుల్వంత్‌లో గడ్కరీ, రత్నాకర్ తదితరులు

అలంకరణలో మహాసమాధి

లేపాక్షిని మరింత అభివృద్ధి చేస్తాం

- ఏపీ పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్



ఆలయాన్ని సందర్శిస్తున్న మంత్రి దుర్గేష్

లేపాక్షి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆయన గురువారం ఆలయాన్ని సందర్శించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభం, నాట్యమండపంలోని తైలవర్ణ చిత్రాలను పరిశీలించారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయ శిల్పకళ అద్భుతమని కొనియాడారు. లేపాక్షికి యునెస్కో శాశ్వత గుర్తింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో లేపాక్షి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16నెలల్లోనే పర్యాటక రంగంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని స్పష్టం చేశారు. లేపాక్షిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. లేపాక్షికి వచ్చే పర్యాటకులు వీరభద్రస్వామి ఆలయం, కదిరి లక్ష్మీనరసింహస్వామి, పుట్టపర్తి సత్యసాయిబాబా ప్రశాంతి నిలయంతోపాటు జిల్లాలోని ప్రకృతి రమణీయ ప్రదేశాలన్నింటినీ కలిపి టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఒకరోజు దర్శనానికి వచ్చే పర్యాటకులు రెండు, మూడు రోజులు ఉండేలా చేయాలన్నదే పర్యాటక శాఖ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం పర్యాటక రంగానికి ఏటా రూ.7 కోట్ల రెవెన్యూ ఇచ్చే హరిత రిసార్ట్ స్థానంలో రిషికొండ లాంటి రాజప్రసాదాన్ని కట్టి పర్యాటకశాఖ రాబడిని దెబ్బతీశారన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం లేపాక్షి ఉత్సవాలను జరపలేదనీ, తాము త్వరలోనే నిర్వహిస్తామన్నారు. అనంతరం మంత్రిని దేవదాయశాఖ సిబ్బంది శాలువాతో సన్మానించారు.

జిల్లాలో రహదారులను అభివృద్ధి చేస్తాం

- మంత్రులు, ఎమ్మెల్యేలకు కేంద్రమంత్రి గడ్కరీ హామీ



పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారు. పుట్టపర్తి పర్యటనకు వచ్చిన ఆయన గురువారం సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాస అతిథి గృహంలో జిల్లాలో రహదారుల ప్రగతిపై రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల ఏర్పాటుపై ఆరాతీశారు. ఎమ్మెల్యేలు, పరిటాల సునీత, ఎంఎస్ రాజు, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తమ నియోజకవర్గాల్లో రహదారుల పరిస్థితిపై కేంద్రమంత్రితోపాటు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పెనుకొండ వద్ద జాతీయ రహదారి-44 నుంచి కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, మహమ్మదాబాద్ క్రాస్, సీజీ ప్రాజెక్టు, కొక్కంటి క్రాస్ మీదుగా చెన్నై జాతీయ రహదారితో కలపాలని కేంద్రమంత్రిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నూతన ఆర్‌అండ్‌బీ రోడ్లు, దెబ్బతిన్న బీటీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖా (మిగతా 6లో...)

ప్రమాద బీమా చెక్కు పంపిణీ



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దరెడ్డిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త నాగరాజు ఇటీవల ప్రమాదంలో మరణించగా.. పార్టీ నుంచి వచ్చిన రూ.5లక్షల బీమా చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అందించారు. గురువారం మంత్రి పరిగి మండల పర్యటనలో భాగంగా బాధిత కుటుంబాన్ని మంత్రి పరామర్శించి, చెక్కును అందించారు. అధైర్యపడొద్దనీ, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.







సంగీత కచేరి నిర్వహిస్తున్న గిరీష్, మాల, సుదర్శన్ బృందం, ప్రసంగిస్తున్న డాక్టర్ గీతాకామత్, గిరీష్‌ని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యుడు చక్రవర్తి

స్వచ్ఛమైన సేవే సత్యసాయితత్వం

- ప్రముఖ వైద్యురాలు గీతాకామత్

పుట్టపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన మనసుతో చేసే సేవే సత్యసాయితత్వమని ప్రముఖ వైద్యురాలు గీతాకామత్ పేర్కొన్నారు. గురువారం రాత్రి సాయికుల్వంత్ మందిరంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. గీతాకామత్ మాట్లాడుతూ.. ప్రేమ, ఆధ్యాత్మికత, సేవలను సత్యసాయి పంచారన్నారు. స్వచ్ఛమైన మనసుతో పనిపై ధ్యాస పెట్టినపుడే దానికి సార్థకత లభిస్తుందన్నారు. నిస్వార్థ సేవలు అందించినపుడు ప్రతి హృదయంలోని దైవత్వం సంతుష్టమవుతుందన్నారు. ప్రేమతో చేసే సేవలు దేవునికి చేరుతాయన్నారు. ప్రతి పనిలో యూనిటీ, ప్యూరిటీ, డివైనిటీ ఉన్నపుడే సార్థకత లభిస్తుందన్నారు. అనంతరం ప్రముఖ సంగీత గాయకులు గిరీష్, మాల, సుదర్శన్ బృందం గానంతో భక్తులను అలరింపజేశారు. అందరూ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రా..రమ్మని..!

పుట్టపర్తిలో ఎన్నో రమణీయ స్థలాలు



6

చరిత్రలో నిలిచేలా..

- వైభవంగా శతజయంతి ఉత్సవాలు
- కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు చరిత్రలో నిలిచేలా ప్రారంభం నుంచి వైభవంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన వేడుకల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కేంద్రపౌర విమానాశ్రయ మంత్రి రామ్మోహన్‌నాయుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రులు నారాలోకేశ్, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, సవిత, బీసీ జనార్దన రెడ్డి, కందుల దుర్గేష్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, సినీనటి ఐశర్య రాయ్ బచ్చన్, గౌరవ ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధ్యక్షులు రామసుబ్రహ్మణ్యన్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు కూడా బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొన్నట్లు వివరించారు.

నాలుగు లక్షలకుపైగా రాక

ఇప్పటివరకు పుట్టపర్తికి 4,24,153 మంది భక్తులు విచ్చేశారని, ఇందులో చాలా మంది సాయి100 యాప్ ద్వారా తమ సందర్శన వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం పుట్టపర్తికి 261 ప్రత్యేక బస్సులను నడుపగా ఇప్పటి వరకు 14272 మంది



యాత్రికులు వివిధ ప్రాంతాల నుంచి రవాణా సేవలు వినియోగించుకున్నారని తెలిపారు. అదనంగా 4606 మంది యాత్రికులు ఉచిత షటిల్ బస్సు సర్వీసుల ద్వారా పుట్టపర్తికి చేరుకున్నారని వివరించారు. 230 మంది వీవీఐపీలకు పుట్టపర్తి సందర్శనకు అన్ని రకాల చర్యలు పూర్తి చేశామన్నారు. యాత్రికుల సౌకర్యార్థం తాత్కాలిక బస ఏర్పాట్ల భాగంగా వెస్ట్ గేటు, ఎనుములపల్లి, ప్రశాంతి నిలయంలో 1,92,151 మందికి బస ఏర్పాటు చేసినట్లు వివరించారు.

25 ఉచిత వైద్య శిబిరాలు

వైద్య ఆరోగ్యశాఖ ఆధర్యంలో వివిధ ప్రాంతాల్లో 25 దాకా ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి వైద్యఆరోగ్య సిబ్బంది ద్వారా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 8011 మంది ఉచిత ఆరోగ్య శిబిరాల వల్ల వివిధ సేవలను వినియోగించుకున్నారని తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం కర్ణాటక నాగేపల్లి, శిల్పారామం, సాయినగర్ క్రికెట్ గ్రౌండ్, అమూల్య లేఅవుట్, పరేడ్ గ్రౌండ్, ఆనంద విలేజ్, సందీప్ బేల్యూ, చెరుకూరి గ్రౌండ్, బుక్కపట్నం రోడ్డు, కమ్మవారిపల్లి తదితర పది ప్రదేశాలు ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు 95 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ద్వారా వివిధ ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు

ట్యాంకర్ల ద్వారా 42 కేంద్రాలలో నీటి సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పురుషులకు 150, మహిళలకు 150దాకా తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరక 356683 మంది భక్తులకు అన్నదానం చేశారన్నారు. 5500 మంది పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో సేవలందించే విధంగా 18 దాకా గుర్తించిన ప్రదేశాలలో అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం 25 సపోర్ట్ 108 అంబులెన్స్ వాహనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.



● చైతన్యజ్యోతి మ్యూజియం

సత్యసాయిబాబా 75వ జన్మదినం సందర్భంగా 2000 సంవత్సరంలో చైనా మూరిష్ గోతిక్ జప నీస్ శైలిలో నిర్మించిన అద్భుత భవనం చైతన్య జ్యోతి మ్యూజియం ప్రారంభించబడింది. ప్రత్యేక ఆకర్షణతో బాబా జీవితం, వారి ప్రపంచసేవామి షన్‌పై రూపొందించిన అంశాలు ఇందులో ఉంటాయి. ఏడు విభిన్న విభాగాలుగా సృజనా త్మకంగా ఏర్పాటు చేసిన మల్టీమీడియా ద్వారా బాబా జననం, బాల్యం, అవతార ప్రవచనాలు బాబా దివ్యమిషన్ ముఖ్యఘట్టాల ప్రదర్శన సందర్శకులకు మధురానుభూతిని ఇస్తుంది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఈ చైతన్య జ్యోతి మ్యూజియాన్ని ఉచితంగా సంద ర్శించవచ్చు. సోమవారం సెలవు.

● శాంతివేదిక

హిల్‌వ్యూ స్టేడియంలో ఏ కార్యక్రమం జరిగినా ప్రధాన వేదిక శాంతివేదికపై సత్యసాయి బాబా ఇతర ప్రముఖులు ఆశీనులై కార్యక్ర మాలను వీక్షించేవారు. ప్రస్తుతం శతజయంతి ఉత్సవాలను సైతం దేశప్రధాని నరేంద్రమోదీ, గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు శాంతివేదికపై ఆశీనులై వీక్షించారు.



● సత్యసాయి స్పేస్ థియేటర్

ప్రశాంతినిలయం విద్యాగిరి విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న సత్యసాయి స్పేస్ థియే టర్ గ్రామీణప్రజలకు ఖగోళశాస్త్రం, విజ్ఞానం గురించి అవగాహన కల్పించడానికి స్థాపించబ డింది. ఇక్కడ ప్రతిరోజు జరిగే ప్రదర్శనలకు ప్రవేశం పూర్తిగా ఉచితం. తెలుగు ఇంగ్లిష, హిందీభాషలలో ఉదయం 10.30 గంటలకు ప్రవేశం ఉంటుంది.

రా..రమ్మని..!

పుట్టపర్తిలో ఎన్నో రమణీయ స్థలాలు

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి రూరల్

ఊరికి తూర్పున చిందులు తొక్కే చిత్రావతి. చుట్టూ కొండలు. ఎంతో ఆహ్లాదం కలిగించే పచ్చదనం. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే వాతావరణం...ఇవీ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతున్న పుట్టపర్తి నైసర్గిక స్వరూపానికి ప్రతీకలు. సత్యసాయి బాబా శత జయంతివేళ దేశం నలుమూలల నుంచే కాక ప్రపంచ దేశాల నుంచి సైతం అనేక మంది భక్తులు పుట్టపర్తికి వస్తున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి మహాసమాధి మాత్రమే కాక పుట్టపర్తిలో చూడదగ్గ మరిన్ని ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఇలా..



● సనాతన సంస్కృతి మ్యూజియం

1990లో స్థాపించిన మొట్టమొదటి మ్యూజియం ఇది. మానవ ఆధ్యాత్మిక వికాసాన్ని ప్రపంచంలోని ప్రధాన మతాల విలువలను శిల్పాలు, చిత్రాలు ప్రదర్శన రూపంలో ఇక్కడ చూపిస్తారు. సత్యసాయి బాల్యలీ లలు, అవతార ప్రకటన ముఖ్యాం శాలు ఇందులో ఉంటాయి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా ప్రవేశం ఉంటుంది. బుధ వారం సెలవు.



● అతిపెద్ద హనుమాన్ విగ్రహం

సత్యసాయి బాబా 65వ జన్మదినాన్ని పురస్కరించుకుని హిల్‌వ్యూస్టేడియంలో 65 అడుగుల హను మాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 1990 నవంబరు 22న సత్యసాయి ఈవిగ్ర హాన్ని ఆవిష్కరిం చారు. హనుమాన్ విగ్రహంతో పాటు బుద్ధ, శివ, కృష్ణ, జీసస్, జొరాస్టర్ విగ్ర హాలను ఏర్పాటు చేశారు.



● హిల్‌వ్యూ స్టేడియం

పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన అద్భుత క్రీడా ప్రాంగణం హిల్‌వ్యూ స్టేడియం. సత్యసాయి విశ్వవిద్యాలయ పరిధిలో భాగంగా ఈస్టేడి యాన్ని అద్భుతంగా నిర్మించారు. దేశ విదే శాల నుంచి వచ్చే సందర్శకులు, భక్తులు ఇక్కడ ప్రతిఏటా జనవరి 11న జరిగే క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 1997లో సత్యసాయి యూనిటీ కప్ పేరిట ఇండియాలెవన్, వరల్డ్‌లెవన్ జట్ల మధ్య ప్రత్యేకమైన క్రికెట్ పోటీని నిర్వహించారు. నాటి మ్యాచ్ సచిన్‌టెండూల్కర్ 88 పరుగు లతో విజృంభించడంతో ఇండియా లెవన్ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది.

తర్వాత బ్యాటింగ్ చేసిన వరల్డ్ లెవన్ జట్టు 26.2 ఓవర్లలోనే 165 పరుగులకు కుప్ప కూలింది. ఆ మ్యాచ్‌కు ముఖ్యఅతిథులుగా అప్పటి ప్రధాని ఐకే గుజ్రాల్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ హాజరయ్యారు.



● ధ్యానవృక్షం (వటవృక్షం)

1959లో సత్యసాయి స్వయంగా నాటిన మొక్క వట వృక్షంగా మారింది. దీనిపై సత్యసాయిబాబా ప్రతిష్ఠించిన యంత్రం కారణంగా ఇక్కడ ధ్యానం చేయడం సాధకు లకు పుణ్యప్రదం అన్ని భక్తుల నమ్మకం. పగటి సమయంలో మాత్రమే, ప్రవేశం ఉచితం.



● సమాధి మందిరం

సత్యసాయిబాబా మాతాపితలు పెద్దవెంకమరాజు, ఈశ్వరాంబ సమాధులు ఉన్న ప్రాంతం ఇది. ప్రతి సంవత్సరం మే 6న ఈశ్వరాం బడే ఘనంగా జరుగుతుంది. ఇక్కడ ప్రత్యేక భజనలు, పూజలు, అన్నప్ర సాదం జరుగుతాయి. ఉదయం సాయంత్రం ప్రవేశం ఉచితం.






● గోపాలస్వామి ఆలయం: పుట్ట పర్తి పురాతన నామం గొల్లపల్లి. గోమాతలను రక్షించేందుకు నిర్మిం చిన గోపాలస్వామి అలయం గ్రామచరిత్రలోని శాప-పరిహార కథతో అనుబంధం కలిగిఉంది.



● సత్యమ్మ ఆలయం: సత్య సాయిబాబా తాత కొండమ రాజు నిర్మించిన అలయం సత్యమ్మ ఆలయం. ఇక్కడ అమ్మవారు గ్రామదేవతగా కొలువుతీరి, భక్తుల పూజలం దుకుంటున్నారు.

● కలలో చూసి..: రాబర్ట్‌బుస్సీ ఫ్రాన్సు



40 సంవత్సరాలుగా ప్రశాంతి నిలయానికి వస్తున్నా. అంతకుముందు ఒకరోజు రాత్రి 'ప్రశాంతి నిలయానికి రా. అక్కడ నీకు అంతులేని ప్రశాంతత ఇస్తా' అని కలలో కనిపించి చెప్పారు. తెల్లవారిన తర్వాత నాకు ఏమి అర్థం కాలేదు. మరు నాడు ప్యారిస్‌లో పెద్ద పార్టీ జరిగింది. ఆ పార్టీకి నాకు సంబంధం లేక పోయినా ఆహ్వానం వచ్చింది. వెళ్లాను. అక్కడ హోటల్ గదిలో అంతకు మునుపు ఉన్నవారు స్వామి ఫొటో మరిచిపోయారు. ఆ ఫొటోలో బాబాను మొట్టమొదటి సారి చూశా. అంతకు ముందు రోజు రాత్రి కలలో చూసిన వ్యక్తి ఆ ఫొటోలో ఉన్న వ్యక్తి ఒక్కరే. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వెంటనే ఇండి యాకు వచ్చా. నేను ఇండియాకు రావడం అదే తొలిసారి. ఇక్కడ అడుగు పెట్టగానే ఏదో తెలియని ప్రశాంత అనుభూతి కలిగింది. ప్రశాంతినిలయానికి వచ్చిన రోజు సాయంత్రమే స్వామి నాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఒక రింగ్ బహూకరించారు. నాటి నుంచి ప్రతి ఏటా ప్రశాంతి నిల యానికి వస్తున్నా.

● శివాలయం.. బాబా జన్మస్థలం

సత్య సాయిబాబా జన్మించి, బాల్యం గడిపిన పవిత్ర గృహం ప్రస్తుతం శివా లయంగా నిర్మించబ డింది 1979లో బాబా ఆలయాన్ని స్వయంగా ప్రారంభించారు.



● కల్పవృక్షం: పుట్టపర్తి చిత్రావతి నది ఒడ్డున ఓబులదేవ రగుట్టపై ఉన్న ప్రసిద్ధ చింతచెట్టు కల్ప వృక్షంగా పేరు గడిం చింది. సత్యబాబా చిన్నతనంలో తన భక్తులు కోరిన పండ్లను ఈ వృక్షం నుంచి తీసి ఇచ్చారని స్థల పురాణం చెబుతోంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రవేశం ఉచితం

● పాతమందిరం.. పెదవెంకమరాజు కల్యాణమండపం

1945లో మొదట బాబా ఆలయాన్ని ప్రారంభించారు. పాత మందిరంగా పలుస్తారు. తరువాత బాబా ప్రశాంతినిల యాన్ని 1950లో నిర్మించడంతో పాతమందిరం వివాహమంది రంగా మారింది.

జిల్లాలో రహదారులను అభివృద్ధి చేస్తాం



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రాలు అందజేస్తున్న మంతులు, ఎమ్మెల్యేలు

(5వ పేజీ తరువాయి)

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. నియోజకవ ర్గంలో రహదారులులేని గ్రామాల వివరాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. అనంతరం పుట్టపర్తి నుంచి బెంగళూరుకు బయలుదేరిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వీడ్కోలు పలి కారు. కార్యక్రమంలో ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, టీడీపీ నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, గంగాధర నాయుడు, సురేష్ చౌదరి, పీసీ గంగన్న, బీజేపీ నాయకులు లాయర్ హరి కృష్ణ, జ్యోతి ప్రసాద్, సునీల్ వైట్ల, సూర్యనారా యణ, కల్యాణ్ కుమార్, నారాయణ, రామాంజి, రాయల్ మురళి పాల్గొన్నారు.

విస్తరించాలి

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విన తులు వెల్లువెత్తాయి. జిల్లాలో జాతీయ రహదా రులను మరింత విస్తరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. కేంద్ర మంత్రిని కోరారు. ఆ మేరకు వినతిపత్రం అంద జేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. పెను కొండ అసెంబ్లీ నియోజకవర్గం, హిందూపురం పార్లమెంటు పరిధిలో శరవేగంగా పారిశ్రామికా భివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ నేప థ్యంలో ముదిగుబ్బ నుంచి పెనుకొండ మీదుగా చెళ్లకెర వరకు అంతర్రాష్ట్ర రహదానిని విస్తరిం చాలనీ, సోమందేపల్లి నుంచి హిందూపురం, దొడ్డబళ్లాపురం మీదుగా యలహంక వరకు వెళ్లే రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చా లనీ, హైదరాబాద్-బెంగళూరు ఎన్‌హెచ్-44ను ఆరులైన్ల రహదారిగా విస్తరించాలని కేంద్రమం త్రిని ఆమె కోరారు.

జిల్లా కేంద్రంతో అనుసంధానించాలి

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. కేంద్ర మంత్రి నితి న్ గడ్కరీని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో చేపట్టిన జాతీయ రహదారుల పనులను త్వరి తగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురా వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రహదారుల అభి వృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు.

రాష్ట్రాల రహదారులను కలపాలి

ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని కర్ణాటకతో రహదా రులను అనుసంధానించి విస్తరించేలా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. అనంతపురం-ఎగువపల్లి రహదారి సమస్యను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరారు. డబుల్‌లైన్‌గా విస్తరించాలని వినతి పత్రం సమర్పించారు. ఇందుకు రూ.35 కోట్లు నిధులు అవసరమవుతాయని వాటిని మంజూరు చేయాలని కోరారు.

జాతీయ రహదారితో అనుసంధానించాలి

పుట్టపర్తి నుంచి మడకశిర మీదుగా హిరియూర్ వరకు రోడ్లను ఎన్‌హెచ్ 44తో అనుసంధానం చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. పుట్టపర్తి నుంచి పెనుకొండ, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని హిరి యూర్ వరకు ఎన్‌హెచ్ 44కు అనుసంధానం చేయాలని విన్నవించారు.

అమృత్ పనులను వేగవంతం చేయాలి

● కలెక్టర్ ఆనంద్


అనంతపురం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమృత్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆ నంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ సెక్టార్‌పై పబ్లిక్ హెల్త్, నగరపాలక సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పబ్లిక్ హెల్త్ పరిధిలో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయా పనుల్లో ప్రతివారం పురోగతి తీసుకురావా లన్నారు. మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లను పెంచాలని ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ, మున్సిపల్ ఆర్డీ నాగరాజు, అనంత నగరపాలక సంస్థ డీసీ పావని పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తికి మహారాష్ట్ర సీఎం రాక

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శుక్రవారం పుట్టపర్తికి రానున్నారు. ఉదయం 9.15 గంటలకు పుట్ట పర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అనం తరం ప్రశాంతి నిలయం చేరుకుని, సత్య సాయి శతజయంతి వేడుకల్లో పాల్గొం టారు. తర్వాత ముంబై బయలుదేరి వెళ తారు. సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి శనివారం ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య కూడా పుట్ట పర్తికి వస్తున్నారు.

సత్యసాయి స్టాంపులు.. గంటలోనే సేల్

పుట్టపర్తి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విడుదల చేసిన పోస్టల్ స్టాంపులు గంటలోపే అమ్ముడయ్యాయి. హిందూపురం డివిజన్‌కు 1200 స్టాంపులను విడుదల చేయగా.. అన్నీ అయిపో యాయని పోస్టల్ సూపరింటెం డెంట్ (హిందూపురం డివిజన్) విజయ్‌కుమార్ గురువారం తెలి పారు. త్వరలోనే స్టాంపులను అందుబాటులోకి తెస్తామన్నారు.



ప్రధాని మోదీ విడుదల చేసిన సత్యసాయి పోస్టల్ స్టాంపులు

నిస్వార్థ సేవాదళ్..!

(5వ పేజీ తరువాయి)

సభ్యులు సేవలు నిర్వహిస్తున్నారని, నిస్వార్థసేవలకు వారు నిద ర్శనంగా నిలుస్తున్నారని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్య క్షుడు నిమీష్ పాండే అన్నారు. సేవాదళ్ సభ్యులకు ఈ సదస్సు చాలా ముఖ్యమైనదని అన్నారు. భగవాన్ సత్యసాయి బాబా తన ప్రేమ, ఆధ్యాత్మిక బోధనలతో లక్షల మంది భక్తులను సేవా మార్గంవైపు పయనించేలా చేశారని అన్నారు. సత్యసాయి సేవా దళ్ సభ్యులు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా తమ తమ ప్రాంతాలలో విద్య, వైద్యం, తాగునీరు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవలు, యువతకు ఉపాధిపై శిక్షణ, బాలవి కాస్ విద్య ద్వారా బోధన అందిస్తున్నారని అన్నారు. సత్యసాయి మార్గమే తమకు శిరోధార్యం అని, అదే సేవాదళ్‌కు స్ఫూర్తి అని అన్నారు.

బాబా సేవలు ప్రపంచ వ్యాప్తం..

శ్రీసత్యసాయి 11వ అంతర్జాతీయ సదస్సుకు 45 దేశాల నుంచి 2500 మంది సేవాదళ్ ప్రతినిధులు హాజరయ్యారని సత్యసాయి సేవాసంస్థల యూకే ప్రతినిధి సురేశ్ మీనన్ అన్నారు. సత్య సాయి బాబా ఆధ్యాత్మిక బోధనలు, సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయని, భక్తులను సేవలపై నడిపిస్తు న్నాయని అన్నారు. నేపాల్, ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ సహా పలు దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారని తెలి పారు. సత్యసాయి సేవాదళ్ బ్రాంచ్‌లు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి, నిస్వార్థ సేవలు అందిస్తు న్నాయని తెలిపారు. 75 మంది విదేశీ డాక్టర్లు, 200 మంది భారతీయ డాక్టర్లు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నా రని తెలిపారు. మనిషి హృదయమనే ఇంటిలో శాంతి అనే దీపం వెలిగించినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. దీనికోసం సేవాదళ్ సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక బోధనలు కొనసాగిస్తున్నారని అన్నారు. అనంతరం సత్యసాయి అంతర్జాతీయ సదస్సుపై ట్రస్టు ప్రతినిధులు పుస్త కాన్ని విడుదల చేశారు.

సౌకర్యాలు లేకపోయినా సేవకు..

ఎలాంటి అనుకూలత, వసతి లేనిచోట సత్యసాయి సేవాదళ్ సభ్యులు సేవా కార్యక్రమాలను అంకితభావంతో కొనసాగిస్తున్నా రని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానందం అన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి గడ్కరీ, నిమీష్‌పాండే, నాగానందం

సత్యసాయి భక్తులు, సేవాదళ్ ప్రపంచాన్ని వసుధైక కుటుంబంగా భావిస్తారని అన్నారు. ఎక్కడ ఎలాంటి విపత్తు, ఆపద ఎదురైనా అక్కడికి వెళ్లి అవసరమైన సేవలను అందిస్తారని కొనియాడారు. ప్రశాంతి నిలయంలో నేర్చుకున్నవాటిని ప్రచారం చేయడమే పర మావధిగా సత్యసాయి సేవాదళ్ సభ్యులు ముందుకు వెళుతున్నా రని అన్నారు. సదస్సు అనంతరం సాయి కుల్వంత్‌లో భక్తులు సంగీత కచేరీని నిర్వహించారు. అంతర్జాతీయ సదస్సుకు ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్, ప్రసాద్, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గే శ్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, సవిత, రోడ్లు, భవ నాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, మాజీ మంత్రులు పల్లె రఘునాథ రెడ్డి, గీతారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జనసేన నాయకులు పత్తి చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

నువ్వేమి చేశావు పాపం..!


శిశువును శిశువిహార్‌కు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

పసికందు ప్రాణం..
దినదిన గండం..
పుట్టిన రోజు నుంచే..
మృత్యువుతో పోరాటం..
రోజుల పాపను కన్న తండ్రే..
డ్యాం వద్ద పడేశాడు..
అమ్మానాన్న, అందరూ ఉన్నా..
అనాథలా.. మారింది..
శిశువిహార్‌కు చేరింది..
నేనున్నానంటూ
అమ్మమ్మ వచ్చింది..
అమ్మలా చూసుకుంటానంది..
నమ్మి అప్పగిస్తే..
ఏం చేసిందో..
ఎవరు ఎత్తుకెళ్లారో..
నిత్య గండాల పసికందు..
ఏమైపోయిందో..
ఎవ్వరికీ తెలియదు..
అందరూ కలిసి..
అదృశ్యం చేశారు..
ఓ పసిపాపా..
నువ్వేమి చేశావు పాపం..
ఎక్కడున్నావమ్మా..
ఎక్కడో.. ఒకచోట..
నువ్వు సల్లగా ఉండాలి..

ఓ పసిగుడ్డు కన్నీటి కథ ఇది. పుట్టిన రోజు నుంచి నిత్యం మృత్యువుతో పోరాటమే. 45రోజుల ఆ శిశువు ఎక్కడుందో, ఎవరికీ తెలియదు. నంబులపూలకుంట మండలకేంద్రంలోని రెడ్డెప్ప, రాధమ్మ దంపతులకు మొదటి కాన్పులో ఆడ శిశువు జన్మించింది. శిశువు ఉండడంతో రాధమ్మ తనను దగ్గరకు రానివ్వలేదన్న కోపంతో ఆమె భర్త రెడ్డెప్ప బిడ్డను కడప జిల్లా వెలిగల్లు రిజర్వాయర్ సమీపంలో గతనెల 17న పడేశాడు. ఆ దారిగుండా వెళ్తున్న ఓ మహిళ గమనించి గాలివీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు చెట్లలో పడి ఉన్న ఆ శిశువును స్టేషన్‌కు తీసుకెళ్లారు. నంబులపూలకుంట పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాధమ్మను విచారించి, ఆమె చెంతకు శిశువును చేర్చారు. మండల పోలీసు స్టేషన్‌లో ఆయా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఒకరోజు శిశువును సంరక్షించారు. అనంతరం పుట్టపర్తి శిశువిహార్‌కు తరలించారు. శిశువు అమ్మమ్మ గంగాదేవి శిశువిహార్‌కు ఫోన్ చేసి శిశువును ఇవ్వాలనీ, తాము సంరక్షించుకుంటామని చెప్పడంతో పదిరోజుల క్రితం తీసుకొచ్చారు. శిశువిహార్, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది.. తల్లీబిడ్డను పర్యవేక్షించాలని సూచించారు. ఈనెల 17న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్త.. శిశువు ఇంటి వద్దకెళ్లి పరిశీలించగా, కనిపించలేదు. బుధవారం వెళ్లి శిశువు ఎక్కడ అని అమ్మమ్మ గంగాదేవిని విచారించగా.. ఎవరో తీసుకెళ్లారని చెప్పింది. సీడీపీఓ రాధమ్మ, సూపర్‌వైజర్ నర్సమ్మ, కార్యకర్త చంద్రకళ.. శిశువు కనిపించలేదని బుధవారం ఫిర్యాదు చేశారు. శిశువు అమ్మమ్మను విచారించగా, అన్నమయ్య జిల్లాకేంద్రమైన రాయచోటికి వెళ్లాననీ, ఆ సమయంలో శిశువు ఏడుస్తుండగా, ఓ మహిళ చేతికిచ్చాననీ, తరువాత కనిపించలేదని పొంతనలేని సమాధానం చెప్పింది. ఆ శిశువు ఎక్కడుంది, ఎలా ఉందన్న విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. అంగన్‌వాడీల పర్యవేక్షణలోపం వల్లే శిశువు పరిస్థితి ఇలా అయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

-నంబులపూలకుంట(ఆంధ్రజ్యోతి)

మీనరాసి..!

ఉమ్మడి జిల్లాలో పెరిగిన మత్స్య సంపద
పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
ఏటా 4 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి
ఐదు రకాల చేపలు...
రూ.80 కోట్ల పైబడి ఆదాయం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



అనంతపురం అర్బన్/ప్రెస్‌క్లబ్/గుమ్మఘట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నీటి వనరులు పెరగడంతో ఉమ్మడి జిల్లాలో మత్స్యసంపద వృద్ధి చెందుతోంది. తద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. చెరువులు, రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉండటంతో చేపల పెంపకం గణనీయంగా పెరిగింది. దీంతో జిల్లా చేపలను పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తద్వారా ఏడాదికి రూ.80కోట్ల పైగా ఆదాయం గడిస్తున్నారు.

చేప పిల్లల పెంపకం

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా అనంతపురం, ఎంపీ డ్యాం, పీఏబీఆర్, బీటీపీ మత్స్యక్షేత్రాల్లో చేపపిల్లల పెంపకం చేపడుతున్నారు. అక్కడి పెరిగిన రెండు నుంచి మూడు ఇంచుల పిల్లలను చెరువులు, డ్యాంలు, రిజర్వాయర్లకు పంపుతున్నారు. ఈ ఏడాది అధికారుల లెక్కల ప్రకారం... అనంతపురం మత్స్యక్షేత్రంలో కట్ల 20 లక్షలు, రోహు 40 లక్షలు, బంగారుమీన(మృగాల) 20 లక్షలు, బంగారుతీగ(చిప్లీస్) 2 లక్షలు చొప్పున మొత్తం 82 లక్షల చేపపిల్లలను ఉత్పత్తి చేశారు. ఎంపీ డ్యాం మత్స్యక్షేత్రంలో కట్ల 20 లక్షలు, రోహు 50 లక్షలు, బంగారుమీన 10 లక్షలు, బంగారుతీగ లక్ష చొప్పున మొత్తం 81 లక్షలు, పీఏబీఆర్ మత్స్యక్షేత్రంలో కట్ల 50లక్షలు, రోహు 80 లక్షలు, బంగారుమీన 20 లక్షలు, బంగారుతీగ 2 లక్షలు మొత్తం 1.52 కోట్లు, బీటీపీ మత్స్యక్షేత్రంలో కట్ల 30 లక్షలు, రోహు 30 లక్షలు, బంగారు మీన 15 లక్షలు, బంగారుతీగ 2 లక్షలు మొత్తం 77 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేశారు. ప్రతి ఏడాది దాదాపు 3 కోట్ల నుంచి 4 కోట్ల వరకూ చేపపిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు.

సహజ వనరు తిలాపియా...

జిల్లాలో అసలు ఖర్చు లేకుండా సహజంగా పెరిగే చేప తిలాపియా(జిలేబీ). వీటి కోసం ప్రత్యేకంగా స్పాన్(గుడ్డు) పెట్టించడం, రేరింగ్ ప్రక్రియ, చేపపిల్లల ఉత్పత్తి, వాటిని ప్రత్యేక పరిస్థితుల్లో పెంచడం లాంటివి ఉండవు. ఈ చేపకు గుడ్డు ప్రక్రియ ఉండదు. ఈ చేప సహజంగా పెరగడంతో పాటు, పిల్లలను అదే నోటి ద్వారా బయటకు వదులుతుంది. నీటిలో సహజసిద్ధంగా దొరికే ఆహారాన్ని తింటూ పెరుగుతాయి. ఏడాది కాలంలో దాదాపు కేజీ సైజులో పెరుగుతుంటాయి. జిల్లాలో ఏడాదికి దాదాపు 500 టన్నుల వరకూ ఉత్పత్తి అవుతోంది. వీటి ద్వారా దాదాపు రూ.5 కోట్ల వరకూ ఆదాయం వస్తున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. ఈ చేపలను కేరళ, కలకత్తా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

5 రకాల చేపల పెంపకం

ఉమ్మడి జిల్లాలో దాదాపు 110 సొసైటీలున్నాయి. ఈ సొసైటీల పరిధిలో దాదాపు 150 చెరువులు, 20 జీపీ ట్యాంకులు, రిజర్వాయర్లు ఉన్నాయి. దాదాపు అన్ని చెరువులు, జీపీ ట్యాంకులు, రిజర్వాయర్లు, డ్యాంలు కలిపి మొత్తం 10 వేల హెక్టార్ల విస్తీర్ణంలో చేపల పెంపకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆయా చెరువులు, డ్యాంలు, రిజర్వాయర్లలో ప్రధానంగా ఐదు రకాల చేపలను పెంచుతున్నారు. కట్ల, రోహు, బంగారుమీన, బంగారు తీగ, గడ్డిచేప రకం చేపలను పెంచుతున్నారు. ప్రధానంగా కట్ల చేప జిల్లాలో దాదాపు సంవత్సరానికి 1.2 కోట్ల నుంచి 1.5 కోట్ల వరకూ ఉత్పత్తి అవుతున్నాయి. రోహు 2 కోట్లు, మృగాల 65 లక్షలు, చిప్లీస్ 10 లక్షలు, గడ్డిచేప 4 లక్షల నుంచి 5 లక్షల వరకూ తయారవుతున్నాయి.



రూ. 80 కోట్లకుపైగా ఆదాయం

జిల్లాలో ఐదు రకాల చేపల పెంపకంతో ఏటా రూ. 80 కోట్లకుపైగా ఆదాయం వస్తున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. కట్లా చేప ద్వారానే అధిక ఆదాయం వస్తోంది. ఏడాదికి దాదాపు 3 వేల టన్నులు కట్ల చేపలు ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా రూ. 36 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. రోహు చేపలు ఏడాదికి 1000 టన్నులు ఉత్పత్తి కాగా... రూ. 12 కోట్లు ఆదాయం వస్తోంది. బంగారుమీన రకం చేపలు ఏడాదికి 1000 టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. వీటి విలువ రూ. 12 కోట్లు, బంగారుమీన రకం చేపలు ఏడాదికి 2 వేల టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. వీటి ద్వారా దాదాపు రూ.24 కోట్ల ఆదాయం వస్తోంది. గడ్డి చేపలు ఏడాదికి 20 టన్నుల వరకూ ఉత్పత్తి అవుతున్నాయి. వీటి ద్వారా రూ.2 కోట్ల వరకూ ఆదాయం వస్తోంది.

పక్క రాష్ట్రాలకు ఎగుమతి

జిల్లాలో పెరిగే ఐదు రకాల చేపలను కోల్‌కతా, హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కోల్‌కతాలోని హౌరా మార్కెట్‌కు అనంత మత్స్య సంపదను ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. కట్ల రకం చేపలు దాదాపు 3 వేల టన్నులు కోల్‌కతా, హైదరాబాద్‌లకు ఎగుమతి చేస్తున్నారు. రోహు వెయ్యి టన్నులు కలకత్తాలోని హౌరా మార్కెట్‌తో పాటు హైదరాబాద్, కర్ణాటక, బంగారుమీన రకం చేపలు కోల్‌కతాతో పాటు కర్ణాటక, హైదరాబాద్, తమిళనాడులకు ఎగుమతి చేస్తున్నారు. బంగారుతీగ రకం చేపకు జిల్లాలో అధికంగా డిమాండ్ ఉండటంతో వీటిని ఎగుమతి చేయడం లేదు.



ప్రతి ఏటా 100 టన్నులు



బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలో ప్రతి ఏటా దాదాపు 100 టన్నులకుపైగా చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. చెరువులో కట్ల, రోహు, బంగారు తీగ, గడ్డిచేపలు, జిలేబీలు పెంచుతున్నారు. 1947 సంవత్సరంలో 23 మంది సభ్యులతో సొసైటీ ఏ ర్పాటైంది. ప్రస్తుతం 133 మంది సభ్యులున్నారు. సంవత్సరానికి దాదాపు రూ. 30 లక్షలకు పైగా ఆ దాయం వస్తోంది. గతంతో పోల్చుకుంటే ఈసారి ఆదాయం బాగానే ఉంది. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

- నగేష్, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు, బుక్కరాయసముద్రం మండలం

జిలేబీలే అధికం



పీఏబీఆర్ డ్యాంలో కట్ల, రోహు, జిలేబీల పెంపకం చేపడుతున్నాం. ప్రస్తుతం డ్యాంలో నీరు ఎక్కువగా ఉండటంతో జిలేబీలే అధికంగా పడుతున్నాం. కట్ల, రోహు పరిమితికి లోబడి పడుతున్నాం. సొసైటీలో 170 మంది సభ్యులున్నారు. జిలేబీలే ఏడాదికి 200 టన్నులకుపైగా ఉత్పత్తి అవుతున్నాయి. టన్ను రూ.40 వేలు పలుకుతోంది. ఇక కట్ల, రోహు చేపలు కేజీ 100 నుంచి రూ. 120లకు అమ్ముతున్నాం. మొత్తం మీద ఏడాదికి రూ. 30లక్షలకు పైబడి ఆదాయం వస్తోంది.

- బెస్త జగదీష్, అధ్యక్షుడు, పీఏబీఆర్ డ్యాం సొసైటీ, కూడేరు మండలం

చేపల సైజు పెరగడం లేదు



శింగనమల చెరువులో అన్ని రకాల చేపలు పెంచుతున్నాం. అయితే చేపలు అనుకున్న సైజులో పెరగడం లేదు. అనంతపురం, చెరువు పై ప్రాంతాల్లో నుంచి వచ్చే పరిశ్రమల కలుషితపు నీటితో చేపలు వృద్ధి చెందడం లేదు. చేపలు నల్లగా మారుతుండటంతో మార్కెట్లో గిరాకీ తక్కువగా ఉంటోంది. ప్రభుత్వం స్పందించి కలుషిత నీరు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

- చిన్న ఆంజనేయులు, మత్స్యకారుడు, శింగనమల మండలం

వర్షాధారంతోనే



బీటీ ప్రాజెక్టుతో పాటు ఇతర చెరువుల్లో వర్షాధారంగా చేపల పెంపకం ఉంటోంది. వేసవిలో చెరువుల్లో, రిజర్వాయర్లు నీరు ఇంకిపోతే మత్స్యకారులకు ఉపాధి ఉండదు. వదిలిన చేపల సైతం బరువు పెరగవు. ప్రస్తుతం బీటీపీ రిజర్వాయర్‌తో పాటు చెరువుల్లో సమృద్ధిగా వర్షపునీరు చేరడంతో చేపల పెంపకం లాభదాయకంగా ఉంది. ఒక్కో మత్స్యకారుడు రోజుకు 20 కేజీల నుంచి 50 కేజీల వరకు వేటాడుకుని విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నాడు. రిజర్వాయర్‌కు హంద్రీనీవా జలాలు చేరితే మత్స్యకారులకు నిత్యం చేపల పెంపకంతో ఆదాయం లభిస్తుంది.

- బెస్త శ్రీరాములు, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

శతాధిక వృద్ధురాలు మృతి


లీలావతమ్మ (ఫైల్)

రాయదుర్గం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌సీ శేషాద్రి సతీమణి లీలావతమ్మ(103) గురువారం హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. లీలావతమ్మ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారని కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. కాగా ఎన్‌సీ శేషాద్రి 1955 నుంచి 62 వరకు రాయదుర్గం ఎమ్మెల్యేగా పని చేశారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

బాలిక అదృశ్యం


మాచిరెడ్డి హరిత

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్చెల్సీ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. అనంతపురం మూడో పట్టణ పోలీసులు గురువారం తెలిపిన వివరాల మేరకు హెచ్చెల్సీ కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి కుమార్తె మాచిరెడ్డి హరిత (17) నగరంలోని నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్ వరకూ చదువుకుంది. అయితే తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా కనిపించకపోవడంతో. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థిని చామన ఛాయ రంగులో ఉంటారని, 5.3 అడుగుల ఎత్తు ఉన్న ఆమె ఆచూకీ తెలిపిన వారు 9490618679, 9346917115 నంబర్లను సమాచారం ఇవ్వాలని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు.

కేబుల్ దొంగలను పట్టుకున్న రైతులు

పోలీసులకు అప్పగింత


రైతులు పట్టుకున్నది వీరినే..

యాడికి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్‌ను అపహరిస్తున్న ఇద్దరు దుండగులను రైతులు కాపుకాసి పట్టుకున్నారు. మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద బుధవారం రాత్రి కేబుల్ అపహరిస్తున్న ఇద్దరిని రైతులు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి ఇద్దరు ద్విచక్రవాహనంలో వచ్చి వాహనాన్ని ఒకచోట ఆపి తోటలోకి వెళ్లారు. దీనిని పసిగట్టిన రైతులు వారు తిరిగి ద్విచక్రవాహనం వద్దకు వచ్చేవరకు అక్కడే ఉన్నారు. దుండుగులు.. తోటలోని బ్యాటరీలు తీసుకుని వచ్చిరు. వారిని పట్టుకుని, రైతులు దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించి.. వారికి అప్పగించారు. సమాచారం తెలుసుకున్న మండలంలోని రాయలచెరువు, చందన, దైవాల మడుగు, లక్షుంపల్లి గ్రామాల రైతులు గురువారం యాడికి పోలీసు స్టేషన్ వద్దకు పెద్దఎత్తున వచ్చారు. దొంగలను విచారించి తమ తోటల్లో అపహరించిన కేబుల్‌ను రికవరీ చేయాలని కోరారు. సీఐ లేకపోవడంతో తాడిపత్రిలో ఏఎస్పీని కలుస్తామని రైతులు బయల్దేరి వెళ్లారు. దొంగలు పెద్దవడుగూరుకు చెందిన వారుగా రైతులు తెలిపారు. గతంలో వారు యాడికి మండలం చందన గ్రామంలో ఉండేవారనీ, ప్రస్తుతం పెద్దవడుగూరుకు మకాం మార్చారని చెబుతున్నారు. దీనిపై సీఐ ఈరన్నను అడగ్గా.. దీనిపై విచారిస్తున్నామని తెలిపారు.

రైతుసేవా కేంద్రాల్లోనే పత్తి కొనుగోళ్లు

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

పెద్దవడుగూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుసేవాకేంద్రాల్లోనే పత్తి కొనుగోలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తేమశాతం బట్టి ధర నిర్ణయిస్తారన్నారు. రైతులు పత్తి దిగుబడిని వ్యయప్రయాసాలకోర్చి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు మునికృష్ణ, మహబూబ్‌బాషా, ముస్తాక్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

చారిత్రక సంపద పరిరక్షణ మన బాధ్యత

డీఆర్‌డీఏ పీడీ శైలజ


పురాతన నాణేల ప్రదర్శనను ప్రారంభిస్తున్న శైలజ

అనంతపురం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చారిత్రక సంపదను పరిరక్షించుకోవడం సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యత అని డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలలో నిర్వహించిన పురాతన నాణేల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురాతన నాణేలు, స్టాంపుల సేకరణలో గోవిందరాజులుగుప్త, శివప్రసాద్‌ల కృషి అభినందనీయమన్నారు. అతి ప్రాచీన మహాజనపదాల కాలాల నుంచి మధ్యయుగం నాటి మహమ్మదీయ రాజ్యాల కాలాలకు చెందిన బంగారు, వెండి, రాగి, ఇత్తడి నాణెములతోపాటు బ్రిటిష్ కాలం నాటి వివిధ రకాల నాణేలు, వివిధ దేశాలకు చెందిన స్టాంపులు ఇక్కడి పురావస్తు ప్రదర్శనశాలలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి మన చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం మ్యూజియంను సందర్శించిన విద్యార్థులకు పురావస్తు శాఖ ఏడీ స్వామినాయక్ పురాతన నాణేలు, స్టాంపుల విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, సభ్యులు కృష్ణమూర్తి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మనారాయణ రెడ్డి, ఫాతిమా మున్నీసా బేగం, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, షేక్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓల సెలక్షన్ జాబితా విడుదల

అనంతపురం న్యూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓల సెలక్షన్ జాబితాను అధికారులు విడుదల చేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్ గురువారం మెమో నెంబర్ 3031131-జీడబ్ల్యూఎస్01-2025 జారీ చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం పరిధిలో పని చేసే గ్రేడ్-1 కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు గత 15 రోజుల నుంచి డిప్యూటీ ఎంపీడీఓల ప్రమోషన్ల జాబితా ఎప్పుడెప్పుడు ప్రకటిస్తారా అని వేచి చూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఎంపిక జాబిత విడుదలైంది. డిప్యూటీ ఎంపీడీఓలుగా ఎంపికైన వారికి మండల స్థాయిలో పోస్టింగ్ ఆర్డర్స్ జారీ చేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సొంత మండలానికి కేటాయించకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరిని డెప్యుటేషన్‌పై మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారులుగా నియమించనున్నారు.

భారత బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు పావని



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత మహిళా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన పావని ఎంపికైంది. ఈమె జనవరి 1 నుంచి నేపాల్ దేశ రాజధాని ఖాట్మాండులో జరిగే అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భారత మహిళా జట్టు తరఫున ఆడనున్నారు. దేశం తరఫున ఆడే అవకాశం కల్పించిన బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి రాజారాం, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయ శంకర్‌రెడ్డి, బాలాజీ, ఉపాధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, వెంకటేశులుకు ధన్యవాదాలు తెలిపారు.

పక్కాగా పాఠశాలల సమాచారం

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ప్రభుత్వ యాజమాన్య పాఠశాల సమాచారం పక్కాగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేపట్టారు. అన్నిమండలాల విద్యాధికారు(ఎంఈఓ)లు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌కు వచ్చారు.అక్కడ ఆయా మండలాలు, పాఠశాలల వారీగా రాష్ట్ర అధికారులు ఆదేశించిన మేరకు పనిచేస్తున్న టీచర్ల వివరాలు, వారి పొజిషన్‌ఐడీలు, క్యాడర్ స్ట్రెంథ్, ఓఆర్‌జీఐడీ సమాచారాన్ని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో పక్కాగా సమాచారం తీసుకుని, అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో వివరాలను ఐటీ సెల్ సిబ్బంది ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు నమోదు చేశారు. ఇందులో పొరబాట్లు దొర్లితే ఆయా ఎంఈఓలు, హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఈఓ ప్రసాద్‌బాబు హెచ్చరించారు.

టమోటా @ 50

భారీగా పెరిగిన ధర

అనంతపురంరూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధర భారీగా పెరిగింది. కిలో ధర ఏకంగా రూ.50కి చేరింది. కొన్ని రోజులుగా మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరిగింది. ఆశించిన స్థాయిలో మార్కెట్‌లో కాయలు లేకపోవడం, ఎగుమతి ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి ఉండడం ధర పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గురువారం గరిష్ఠంగా కిలో రూ.50తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.27, సరాసరి రూ.37తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,875 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

రేపు పంచాయతీల్లో గ్రామ సభలు

అనంతపురం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఈనెల 22న జాబ్ కార్డులు, అభ్యంతరాల స్వీకరణ కోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ సలీం బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభల్లో జాబ్ కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఉపాధి కూలీలకు ఈకేవైసీ చేసిన నేపథ్యంలో తొలగించిన కూలీల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. కూలీలకు పనులు కల్పించడంపైనా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

అనంతలో సీపీఐ వందేళ్ల వేడుకలు

10న నిర్వహణకు ఏర్పాట్లు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్


మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, నవంబరు20(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల వేడుకలను డిసెంబరు 10వ తేదీన అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. గురువారం సీపీఐ స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జగదీష్ మాట్లాడుతూ.. డిసెంబరు 26 నాటికి సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతుందన్నారు. ఈనేపథ్యంలో డిసెంబరు 10వ తేదీన అనంతపురంలోని లలితకళాపరిషత్‌లో వందేళ్ల వేడుకలు నిర్వహిస్తామన్నారు. కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న క్రియాశీలక కుటుంబాలు, నాయకులతో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేస్తామన్నారు. వేడుకలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య హాజరవుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జాఫర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు, కేశవరెడ్డి, రామక్రిష్ణ, పద్మావతి, లింగమయ్య, రమణయ్య, రాజేష్, రమణ, సంతోష్, కుళ్లాయిస్వామి, చిరంజీవి, చెన్నప్ప, పెద్దయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి నైపుణ్య పోటీలు

అనంతపురం విద్య, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులకు ఈనెల 22న జిల్లా స్థాయి నైపుణ్య పోటీలు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 73 పాఠశాలల్లో ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వివిధ విభాగాలలో నైపుణ్య పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో ఒకేషనల్ ట్రైనర్ ద్వారా రెండు నమూనాలతో బుక్కరాయసముద్రం కేజీబీవీలో జరిగే ప్రదర్శనకు విధిగా హాజరు కావాలని ఏపీసీ తెలిపారు.

న్యూస్ బాక్స్

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

● వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ


ధర్మవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

ధర్మవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. గ్రంథాలయ వారోత్సవాలలో బాగంగా వారం రోజులుగా గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో స్థానిక గ్రంథా లయంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చింతపులుసు పెద్దన్న, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

● గాండ్లపెంట: వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ముగింపు రోజు సందర్భంగా గ్రంథాలయ అధికారి శాంతమ్మ గురువారం బహుమతులు అందజేశారు.

● కొత్తచెరువు: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో గురువారం వివిధ పోటీల్లో పాల్గొని, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: విద్యార్థి దశ నుంచే గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకుని, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ఎంపీడీఓ పార్థసారథి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ పార్థసారథి, ఎంఈఓ సుబ్బిరెడ్డి, హెచ్ఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. వారు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

● నల్లమాడ: మండలకేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సమావేశాన్ని గురువారం నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి శకుంతలబాయి తెలిపారు. వారోత్సవాల సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

● ఓబుళదేవరచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి రాజబాబు తెలిపారు. విజేతలకు స్థానిక ప్రధానోపాధ్యాయురాలు శిరీష చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

'లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి'


లే అవుట్లలో నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

నంబులపూలకుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అక్రమంగా లేఅవుట్లు వేసినవారు, వాటిలో ప్లాట్లు కొన్నవారు ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి తెలిపారు. వారు గురువారం స్థానిక లేఅవుట్లలో నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో ఇప్పటికే 274/2, 274/1, 643/1, 643/3సి, 643/ఇ, 573, 678, 643/3డి, 641/1సి1, 716, 276, 277, 278, 561, 712 సర్వే నెంబర్లలో అక్రమ లేఅవుట్లు వేశారని, వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. అలాంటి వాటికి ఎల్ఆర్ఎస్ కింద అనుమతులు తీసుకోవడానికి ప్రభుత్వం 2026 జనవరి 23వరకు అవకాశం ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకుని క్రమబద్ధీ కరించుకోవాలని సూచించారు. అనుమతిలేని లేఅవుట్లలో భవనాలు నిర్మించరాదని, అటువంటి వాటిపై ఇప్పటికే ఆహుడా వారికి ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ నాగరాణి, పంచాయతీ కార్యదర్శి రమేష్, సర్వేయర్లు బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆట వస్తువుల పంపిణీ


దాత ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గాండ్లపెంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కటారుపల్లి యోగివేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ పాఠశాలకు రూ.2లక్షల విలువైన ఆట వస్తువులను, ఇన్వర్టర్‌ను దాత అందజేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన యోగి వేమన ఫౌండేషన్-ఎన్‌మాక్స్ ఇంజనీరింగ్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు ప్రసాద్‌రెడ్డి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు గురువారం దుశ్శాలువ, పూలమాలలతో పాఠశాలలో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ప్రథమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు సరళ, ఉపాధ్యాయులు అర్జున్ రావు, సురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్బరీ రైతులకు అవగాహన


మండ్లిపల్లి వద్ద మల్బరీ తోటను పరిశీలిస్తున్న ఏడీ

తనకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మండ్లిపల్లి మిట్ట వద్ద రైతు రామిరెడ్డి సాగుచేసిన మల్బరీ తోటలో మల్బరీ సాగుచేసే రైతులకు సెరికల్చర్ ఏడీ వెంకట స్వామినాయక్ గురువారం అవగాహన కల్పించారు. ఎకరం మల్బరీ సాగుకు సాధారణ రైతులకు ప్రభుత్వం రూ.22,500, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27వేల సాయం అందిస్తోందన్నారు. ఐదెకరాల వరకు ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. టైప్ -1 షెడ్ నిర్మాణానికి సాధారణ రైతులకు రూ.3,37,500, ఎస్సీఎస్టీలకు రూ.4.05 లక్షలు, టైప్-2 షెడ్ నిర్మాణానికి సాధారణ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్టీ,ఎస్సీలకు రూ.2.70లక్షలను ప్రభుత్వం సాయం చేస్తున్నట్లు వివరించారు. కదిరి ప్రాంతంలోని ఓబుళదేవరచెరువులోని కుటాగుళ్ల, తనకల్లు మండలంలోని మండ్లిపల్లి వద్ద సీఆర్సీ సెంటర్లు (సెరికల్చర్ రేరింగ్) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల రైతులు సెరికల్చర్ సాగుకు ముందుకురావాలని కోరారు. సెరికల్చర్ అధికారి మస్తాన్, మండ్లిపల్లి, కోటూరు, పరాకువాండ్లపల్లి, తనకల్లు, రాచువారిపల్లి గ్రామాల రైతులు, సీఆర్పీ నిర్వాహకులు మండ్లిపల్లి భాస్కర్‌రెడ్డి, సెరికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఇరువైపులా కప్పేసిన గడ్డి

● వాహనదారులకు ఇబ్బందులు


కమ్మవారిపల్లి-కొండేపాళ్యం రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డి

నల్లమాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమ్మవారిపల్లి నుంచి పాత బత్తలపల్లి మీదుగా కొండేపాళ్యం వరకు రోడ్డుకు ఇరువైపుల గడ్డి ఏపుగా పెరిగింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు అంటున్నారు. ఏపుగా పెరిగిన గడ్డిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కమ్మవారిపల్లి నుంచి పాత బత్తలపల్లి, చంద్రాయునిపల్లి, కొండేపాళ్యం మీదుగా కదిరికి వెళ్లే ఈ రహదారి 18 కిలోమీటర్లు ఉంది. ఈ రహదారిలో 15 మలుపులున్నాయి. ఇది సింగల్ రోడ్డే. ఈ రోడ్డుకు ఇరు వైపులా గడ్డి, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. వాహనాలు ఎదురెదురుగా వస్తే ఏదో ఒక వాహనం గడ్డిలోకి వెళ్లాల్సిందే. లేకపోతే ప్రమాదాలు జరిగే సంఘటనలున్నాయి. ఈ రోడ్డు గుండా కదిరికి నిత్యం ఎనిమిది గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. గడ్డి ఏపుగా పెరిగి నందు వల్ల ఈ రోడ్డు మలుపుల్లో ప్రమాదాలు జరిగి పలువురికి కాళ్లు చేతులు విరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన గడ్డిని తొలగిస్తే, కొంతవరకు ప్రమాదాలు అరికట్టడంతో పాటు, వాహ నాల రాకపోకలకు సులువుగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. అధి కారులు స్పందించి రోడ్డుకిరువైపులా గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు



కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

పుట్టపర్తి టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలలో పాల్గొనడానికి కేంద్ర జాతీయ రహదారుల, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, బీసీ.జనార్ధన రెడ్డి, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ఆదినారాయణ యాదవ్, జనసేన నాయ కుడు పత్తి చంద్రశేఖర్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, సత్యసాయి ట్రస్టు సభ్యులు తదితరులు కేంద్ర మంత్రికి ఘనస్వాగతం పలికారు. శతజయంతి ఉత్సవాలలో పాల్గొన్న అనంతరం కేంద్రమంత్రి మధ్యాహ్నం తిరిగి వెళ్లారు.

బైపాస్‌లో ప్రమాదాలను అరికట్టండి

● సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైపాస్‌లో తరచూ జరిగే ప్రమాదాలను అరికట్టాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. స్థానిక కాకతీయ డాబా సమీపంలో బత్తలపల్లి వైపు నుంచి వచ్చే నాలుగు రోడ్లు, కదిరి బైపాస్ రోడ్డును కలుపుతూ నిర్మించిన కూడలిని సీపీఐ నాయకులు గురువారం బీజేపీ మండల కన్వీనర్ అంజన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ... ఇక్కడ ఇరువైపులా ఐదు రోడ్లను నిర్మించి సర్కిల్ ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఏ మార్గాలను తెలిపే సరైన సూచిక బోర్డులు లేకపోవడంతో వాహన చోదకులు తికమక పడుతూ... ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యంగా బైపాస్ రోడ్డుతోపాటు ముదిగుబ్బ టౌన్‌లో నుంచి వచ్చే వాహన డ్రైవర్లు ఎక్కువగా కన్‌ఫ్యూజ్ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రింగ్ రోడ్డు నుంచి అనంతపురం రోడ్డు వైపు దాదాపు మూడు కిలోమీటర్ల వరకు యూటర్న్ లేకపోవడంతో సమీపంలోని కస్తూర్బా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోని పక్షంలో రాస్తారోకో చేపడుతామని హెచ్చరించారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక


ఎస్టీయూ నూతన కార్యవర్గ సభ్యులు

కదిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం ఓబుల రెడ్డిపల్లిలోని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో గురువారం ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా విజయవర్ధన్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా హరిప్రసాద్‌రెడ్డి, మహిళా కన్వీనర్ పద్మజ, మైనార్టీ కన్వీనర్ తబ్రేజ్ బాషా, జిల్లా కౌన్సిలర్లుగా రమణానాయక్, మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణ, రాజశేఖర్ రెడ్డి, ఎం. వెంకటరమణ, బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

నల్లమాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఈశ్వర్‌వాటర్ ప్లాంటు సమీపాన గుజిరీ సేకరించే అంజనేయులు (50) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కదిరి మండలంలోని కమ్మరవాండ్లపల్లి సమీపానగల బాబాకాలనీలో అంజనేయులు, తులసమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారు గ్రామాలకు వెళ్లి గుజిరీ వస్తువులు ఏరుకుని, ఆటోలో వేసుకుని కదిరి పట్టణంలో విక్రయించి, జీవనం సాగిస్తున్నారు. ఈనెల 18న ఉదయం 7.30 గంటలకు ఆటోలో గ్రామాలకు వెళ్తున్నట్లు చెప్పి అంజనేయులు వెళ్లాడు. మంగళవారం నల్లమాడలో అతిగా మద్యం తాగి పడిపోయినట్లు సమాచారం. ఆ తర్వాత చనిపోయాడు. ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు చూడగా.. మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య తులసమ్మకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. తులసమ్మ ఫిర్యాదు మేరకే కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అంజనేయులుకు నలుగురు కుమార్తెలున్నారు. ఒకరికి వివాహం కాగా.. ఇద్దరు డిగ్రీ, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. తన భర్తకు తాగుడు అలవాటు ఉందనీ, అతిగా తాగి చనిపోయి ఉంటాడని తులసమ్మ పేర్కొన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


దశావతారం నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శిల్పారామంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. బాబాజయంతి ఉత్సవాల గానం, మహాగణపతిమ్, జరుగుతున్నది జగన్నాటకమ్, తరంగం, థిల్లానా తదితర గానాలకు గురువారం చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి.

మాజీ మంత్రి గీతారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే


గీతారెడ్డికి బాబాచిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

● పుట్టపర్తి రూరల్: సత్యసాయి శతజయం తి ఉత్సవాల్లో పాల్గొనేం దుకు ప్రశాంతి నిల యానికి వచ్చిన మా జీ మంత్రి గీతారెడ్డికి ఎమ్మెల్యే పల్లె సింధూ రరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఘనస్వాగతం పలికారు. ప్రశాం తినిలయానికి గురువారం రాత్రి వచ్చిన గీతారెడ్డిని వారు స్థానిక శాంతిభవన్‌లో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తాడిమర్రి విద్యార్థిని


ఎంపికైన విద్యార్థినితో హెచ్ఎం, పీడీ

తాడిమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వర్షిత రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్ఎం అరుణ తెలిపారు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్‌పోటీలలో వర్షిత ఎంపికైనట్టు హెచ్ఎం తెలిపారు. ఈ నెల 22నుంచి 24వ తేదీ వరకు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వర్షిత పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. వర్షితను పాఠశాల హెచ్ఎంతో పాటు పీడీ అమరాంజనేయులు, పీఈటీ ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

బేస్‌బాల్ పోటీలకు కొత్తచెరువు విద్యార్థులు

కొత్తచెరువు,నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వరుణ్,లోకేశ్వరి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైయ్యారని ఆ పాఠశాలల పిడిలు వెంకటేష్, సూర్యనారాయణమ్మలు గురువారం తెలిపారు.ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన అండర్-14 బేస్‌బాల్ జిల్లా పోటీల్లో ఈ విద్యార్థులు ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారని వారు తెలిపారు. రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆ పాఠశాలల హెచ్ఎంలు గోపాల్, నుర్జహన్ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

అట్టహాసంగా సంధా రాఘవ జన్మదిన వేడుకలు

ధర్మవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధా రాఘవ జన్మదిన వేడుకలు గురువారం అట్టహాసంగా జరిగాయి. స్థానిక కొత్తపేట సర్కిల్‌లో ఆయన వందలాది మంది టీడీపీ నాయకులు, అభిమానులు మధ్య కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా చౌడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, మిత్రులు సంధా రాఘవ, సంధా రవీంద్రను క్రేన్ సాయంతో గజమాలతో ఘనంగా సత్కరించారు. రాఘవకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అక్కడే పేదలకు ఉచిత కంటి వైద్యశిబి రాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన యువకులను అభినందించారు. అనంతరం రాతిదూలం పోటీలను ప్రారంబించారు. రాత్రి 7గంటల సమయంలో స్థానిక చక్రవర్తి థియేటర్ సమీపంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కొత్తపేట సర్కిల్ జనంతో కిక్కిరిసిపోయింది. విద్యార్థులు సైతం తర లివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాం క్షలు తెలిపిన వారిలో టీడీపీ నాయకులు నాగూర్‌హుస్సేన్, జింకా నాగభూషణ, కొత్తపేట ఆది, జిలకర శీన, జనార్ధన్, బొట్టు కిష్ట, జింకల రాజన్న, కేశగాళ్ల శీన, పూజామొబైల్ సాయి,, చిన్నవీరప్ప, లింగప్ప, సాయిక్రిష్ణ , కరెంటు ఆది, రావుచెరువు కుళ్లాయప్ప, ముతుకూరు బీటీ, యుగంధర్, వంట రమేశ్ పాల్గొన్నారు. అలాగే ఆయన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. యోగా 11 జట్టు, గొట్లూరు వాల్మీకి జట్టు తలపడగా, యోగా 11జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.10వేలు, రన్నర్‌గా రూ.5వేలను ఆయన బహుమతిగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఏడాది సీఎం పుట్టినరోజు సందర్భంగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తామన్నారు.


రాఘవను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, మిత్రులు


టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న సంధా రాఘవ

భక్తిశ్రద్ధలతో కూష్మాండ దీపోత్సవం


ధర్మవరంలోని కాలభైరవుడు

ధర్మవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చక్రవర్తి థియేటర్ సమీపంలో స్వయంభూ కాలభైరవస్వామి ఆలయంలో కూష్మాండ దీపోత్సవాన్ని గురువారం అర్చకులు ధనుంజయాచారి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అమావాస్య పూజలకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. అమావాస్య ఘడియల్లో ఆలయంలో పూజారి దోషనివారణ పూజలు చేశారు. అలాగే భైరవుడి ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించారు. హిందూపురానికి చెందిన లోక్‌నాథ్ ,లావణ్య అన్నదానం ఏర్పాటు చేశారు.


ఆలయం ఎదుట దీపాలు వెలిగిస్తున్న భక్తులు

●ధర్మవరంరూరల్: మండలంలోని కుణుతూరులో వెలసిన చంద్రమౌళీశ్వరాలయంలోని కాలభైరవస్వామికి అర్చకులు గురువారం కూష్మాండ దీపోత్సవం నిర్వహించారు. కార్తీక అమావాస్యను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు తరలివచ్చి స్వామి ఎదుట దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


కాలభైరవస్వామి ఎదుట కూష్మాండ దీపాలు వెలిగించిన దృశ్యం

సచివాలయం ఎదుట చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి స్పందన

కొత్తచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 ఎదుట చెత్తను తొలగించారు. అక్కడ చెత్తపేరుక పోయి, దుర్వాసన వెదజ ల్లుతోందని స్థానికు ఆవేదన వ్యక్తం చేసేవారు. ఈ విషయంపై 'చెత్తను తొలగించరూ...' అంటూ గురువారం ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం వెలువడిన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన గ్రామ పంచాయతీ అధికారుల ఆదేశంతో పంచాయతీ కార్మికులు అక్కడి చెత్తను తొలగిం చారు. దీంతో పరిసరాల్లోని ఇళ్లవారు, సచివాలయ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం సమీపంలో చెత్తను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు


రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ధర్మవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. వారు గత నెలలో అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచినట్టు ఆయన గురువారం తెలిపారు. వారిలో అండర్-17 బాలుర విభాగంలో.. పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ, కార్తీక్, యేసు, బాలికల విభాగంలో.... శరణ్య, అండర్-14లో ప్రియ, దీప్తి ఎంపికైనట్టు తెలిపారు. వీరు శుక్రవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు జరిగే 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. వారిని శెట్టిపి జయచంద్రా రెడ్డి తదితరులు వారిని అభినందించారు.

కమ్మవారిపల్లికి నేడు ఎమ్మెల్యే రాక

నల్లచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో వెలసిన అభయాంజనేయస్వామికి మండల పూజ (41 రోజులు) పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గ్రామానికి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్, తెలుగు యువత అధ్యక్షుడు గుత్తా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

● నలుగురికి తీవ్రగాయాలు

నల్లమాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండకిందతండా సమీపంలో గురువారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని, నలుగురికి తీవ్రగాయాలు కాగా ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని సి.కొత్తపల్లి, గోపేపల్లికి చెందిన ఎనిమిది మంది కూలీలు ఆటోలో కొండకిందతండాలో మామిడితోటలో పాదులు చేయడానికి ఉదయమే వెళ్లారు. కూలి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామాలకు వెళ్తున్నారు. అలాగే రెడ్డిపల్లికి చెందిన శ్రీనివాసులనాయక్ తన ఇద్దరు కుమార్తెలతో రెడ్డిపల్లి నుంచి కొండకింద తండాకు ద్విచక్రవాహనంలో వెళ్తున్న వెళ్తున్నాడు. కొండకింద తండా, వేళ్లమద్ది గ్రామాల మధ్యలో ఉన్న మలుపులో రెడ్డిపల్లి నుంచి వస్తు న్న ద్విచక్రవాహనం ఆ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపేపల్లికి చెందిన యశోద, సి. కొత్తపల్లికి చెందిన లక్ష్మీదేవి, ఆటో డ్రైవర్ అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాసులనాయక్‌కు తలకు బలమైన గాయమైంది. ఈ నలుగురిని నల్లమాడ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన కూలీలు గంగులప్ప, సునీత, లక్ష్మీదేవి, అంజనమ్మ, లలిత, క్రిష్టమ్మ, ఆదిలక్ష్మికి స్వల్ప గాయాలుకాగా నల్లమాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీనివాసులు నాయక్ కుమార్తెలు కూడా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

బాలయ్యను విమర్శించేస్థాయా మీది..?

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి


మాట్లాడుతున్న టీడీపీ మహిళా నేతలు

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బాలకృష్ణను విమర్శించే స్థాయా.. మీది అని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. పురం వైసీపీ ఇన్‌చార్జి దీపిక.. నీ చుట్టూ ఉన్నదెవరో చెప్పండి.. అని ప్రశ్నించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆమెతోపాటు రాష్ట్ర మాజీ కార్యదర్శి రామాంజినమ్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు రాధ, చెన్నమ్మ, విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణను విమర్శించడంవల్ల జరిగిన ఘటనను భూతద్దంలో చూపిస్తూ ఏదో సాధించాలని చూస్తున్నారన్నారు. నీ భర్త వేణురెడ్డి గుడ్డంపల్లి వదిలి బెంగళూరు వెళ్లడానికి కారణం ఏంటో బహిరంగంగా చెప్పగలవా అని ప్రశ్నించారు. ఐదేళ్ల మీ పాలనలో హిందూపురానికి ఎన్ని నిధులు తెచ్చారో చర్చకు సిద్ధమా అని బహిరంగ సవాల్ విసిరారు. ఇసుక, దేవుడి మాన్యాలు మీరు కబ్జాచేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రతి కార్యాలయంలోనూ నెలవారి మామూళ్లు తీసుకున్నది మీరు కాదా అని అన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. సమావేశంలో చిలమత్తూరు మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, మాలక్క, అంజలి, లక్ష్మీదేవి, కౌన్సిలర్ సునీత, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి పలువురు క్రీడాకారుల ఎంపిక

వాలీబాల్ పోటీల్లో స్కంద ప్రతిభ

పెనుకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లాకుచెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభచాటారు. జిల్లాస్థాయిలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి స్కంద ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాఘవయ్య, పీడీ నాగభూషణం తెలిపారు. డిసెంబరు 6, 7, 8 తేదీల్లో నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటుందని వివరించారు. అదేవిధంగా పెనుకొండ మండలం రాంపురం జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని అలేఖ్య డిస్కస్‌త్రోలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ దివాకర్‌యాదవ్ తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నారు.


హెచ్‌ఎం, పీడీతో విద్యార్థి స్కంద


అలేఖ్య


విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

● **గోరంట్ల:** పాలసముద్రం ఉన్నతపాఠశాల విద్యార్థులు లిఖిత, చైతన్య కుమార్‌రెడ్డి జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రామాంజులు తెలిపారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో అండర్-14 విభాగంలో జరిగిన బేస్‌బాల్ పోటీల్లో వీరు ప్రతిభచూపడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను గురువారం హెచ్‌ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రమథ, గంగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

● **పావగడ:** మధుగిరిలో గురువారం జరిగిన డ్రాయింగ్ పోటీల్లో పళవల్లి అంబేడ్కర్ వసతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎంజే శశాంక్ ప్రతిభచూపాడు. రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ లత, పీటీ వెంకటేశ్ అభినందించారు.


శశాంక్

పురం అభివృద్ధికి రూ.15 కోట్లు విడుదల

హిందూపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సెంట్రల్‌లైటింగ్, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటుకు రూ.15 కోట్లు విడుదలైనట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య తెలిపారు. ఈ నిధులతో గాంధీసర్కిల్ నుంచి బాలాజీ సర్కిల్ వరకు 40 అడుగుల రోడ్డు, డివైడర్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బాలాజీ సర్కిల్ నుంచి ధర్మపురం బైపాస్ రోడ్డు, డివైడర్లు ఏర్పాటు చేస్తారన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

వైభవంగా జ్వాలాతోరణం

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మపురంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం ఆఖరిరోజు అమావాస్య సందర్భంగా కార్యక్రమం వైభవంగా సాగింది. పూజల్లో మున్సిపల్ చైర్మన్ రమేష్ తదితరులు హాజరయ్యారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

పట్టణంలోని దండురోడ్డులో నివాసమున్న ఆదిలక్ష్మమ్మ కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ఆదిలక్ష్మమ్మ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డు పొంది ఉందని, ఆదిలక్ష్మమ్మ ఆకస్మికంగా మృతిచెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు గురువారం పార్టీ పంపిన రూ.5లక్షల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకున్నవారికి ఇది కొండంత అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, మూర్తి, రాఘవేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

లేపాక్షి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త ధనుంజయ రెడ్డి(58) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు, బాలాజీ, స్థానిక నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.


నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రబీకి సిద్ధమవుతున్న రైతులు

సాధారణ సాగు విస్తీర్ణం రెండు వేల హెక్టార్లు
సబ్సిడీ వేరుశనగ కోసం ప్రతిపాదనలు
నియోజకవర్గానికి 500 క్వింటాళ్ల కేటాయింపు

మడకశిర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రబీకి రైతులు సన్నద్ధమవుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట దెబ్బతింది. నష్టపోయిన రైతులు రబీలోనైనా బోరుబావుల కింద పంట పండించి అప్పులు ఊబిలో నుంచి బయట పడదామని ఆశించి రబీకి సన్నద్ధమవుతున్నారు. చాలా మంది రైతులు వేరుశనగు సాగువైపు మొగ్గు చూపుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో వేరుశనగ సాగు తగ్గింది. సాగు చేసిన వేరుశనగ కూడా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంట కాస్త దెబ్బతిని దిగుబడి తగ్గింది. రబీలో వేరుశనగ నియోజకవర్గంలో నార్మల్ ఏరియా 1600 హెక్టార్లు ఉన్నట్లు సంబంధిత అధికారుల సమాచారం. వేరుశనగ పంట సాగు చేసేందుకు వీలుగా అధికారులు సబ్సిడీ వేరుశనగ కోసం ప్రతిపాదనలు పంపారు. నియోజకర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాలకు కలిపి 500 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాన్ని కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు వేరుశనగ సాగు చేసేందుకు పొలాలను దుక్కులు దున్ని సన్నద్ధం చేస్తున్నారు. డిసెంబరు 15 వరకు వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. రెండు రోజుల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ గోదాములకు చేరుకుంటుందని, వెంటనే రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.


సాగుకు సిద్ధంచేసిన పొలం

పెరగనున్న సాగు

గత సంవత్సరం కంటే ఈఏడు రబీలో సాగు విస్తీర్ణం పెరుగనుంది. దశాబ్దకాలంగా సరైన వర్షాలు కురవకపోవడం, భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లలో నీటిమట్టం తగ్గడంతో రబీలో సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. నెల రోజుల కిందట వర్షాలు కురవడం, చెరువుల్లో కొద్దిపాటి నీరు నిల్వ ఉన్నాయి. కృష్ణానది జలాలు హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు చేరి జలకళ సంతరించుకుంటున్నాయి. దీంతో భూగర్భజలాల మట్టం పెరిగి బోర్లలో నీటిమట్టం పెరగడం వల్ల రబీలో పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు అంటున్నారు. నియోజకర్గంలో మణూరు చెరువు నిండింది. హారేసముద్రం చెరువులో సగానికి పైగా నీరు నిల్వ ఉంది. బోరు కింద ఎకరా, అరెకరా సాగు చేసే రైతులు కూడా పూర్తిస్థాయిలో పంటలు సాగు చేయనున్నట్లు సమాచారం. సాగుకు అవసరం ఉన్నంత మేర వేరుశనగను సబ్సిడీతో అందించాలని రైతులు కోరుతున్నారు.

500 క్వింటాళ్ల కేటాయింపు

రబీలో బోరుబావుల కింద వేరుశనగ పంట సాగు చేసేందుకు సబ్సిడీ విత్తన వేరుశనగను నియోజకవర్గానికి 500 క్వింటాళ్లు కేటాయించారు. నియోజకర్గంలో వేరుశనగ నార్మల్ ఏరియా 1600హెక్టార్లు. రెండు రోజుల్లో గోదాములకు వేరుశనగ సరఫరా అవుతుంది. త్వరలోనే రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది.

-తిమ్మప్ప, ఏఓ

విద్యార్థుల సౌకర్యాలపై పర్యవేక్షణ ఏదీ..?

దుమ్ముధూళిలోనే మధ్యాహ్న భోజనం
గుంపులుగా తిరుగుతున్న శునకాలు
పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు


దుమ్ము, ధూళి, కుక్కల నడుమ భోజనం చేస్తున్న విద్యార్థులు

సోమందేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు తీరు అధ్వాన్నంగా ఉంది. పాఠశాలలో 938 మంది విద్యార్థులు 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ప్రతిరోజూ ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అభాసుపాలవుతోంది. నిర్వాహకులు, పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో అమలు తీరు అధ్వాన్నంగా ఉంది. గురువారం మెనూ ప్రకారం కోడిగుడ్లు, చారు, వెజిటబుల్ రైస్ వడ్డించారు. అయితే విద్యార్థులు భోజనం చేసే తరగతి గదుల వరండాలో కూర్చోబెట్టాల్సి ఉండగా పర్యవేక్షక బాధ్యతలో ఉన్న ఉపాధ్యాయులు, వ్యాయామ అధ్యాపకులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. విద్యార్థులు పాఠశాల ముందున్న చెట్లకింద మట్టిలో కూర్చుని దుమ్ముధూళి మధ్య భోజనం చేయడం వారిచుట్టూ శునకాలు సంచరించడం కనిపించింది. అయినా సిబ్బంది తమ తమ వ్యాపకాల్లో సెల్‌ఫోన్‌లలో మునిగి తేలుతూ కనిపించారు. ఎక్కడబడితే అక్కడ విద్యార్థులు ఎవరికితోచిన విధంగా వారు భోజనం ప్లేట్లు పట్టుకుని తినడం కనిపించింది. కొంతమంది పాఠశాల తరగతి గదుల్లోనే భోజనం చేయగా మరికొందరు నేలపై, మట్టిపై, వరండాలో అపరిశుభ్రంగా ఉన్నచోట కూర్చుని భోజనం చేశారు. ఆ సమయంలో పాఠశాల ఆవరణంలో శునకాలు గుంపులు గుంపులుగా విద్యార్థుల మధ్య పోట్లాడుతూ కనిపించాయి. కోతులు చొరబడి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశాయి. పేద విద్యార్థులంటే అంత చులకనా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం సన్నబియ్యం సరఫరాచేసి ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో లక్షలాది రూపాయలు ఖర్చుపెడుతుంటే పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. అపరిశుభ్రతవల్ల ఆరోగ్యం వికటిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ-2కు వివరణ కోరగా మధ్యాహ్న భోజనం అమలులో భాగంగా ఉపాధ్యాయులు, పీడీలో పర్యవేక్షణ బాధ్యతలో ఉంటారని, పొరపాట్లు జరిగే అవకాశం లేదన్నారు. అలాంటిదేదైనా జరిగి ఉంటే విచారించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కూలుతున్న పచ్చనిచెట్లు

కర్ణాటకకు తరలుతున్న కలప
పట్టించుకోని అధికారులు

గుడిబండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో పచ్చనిచెట్లు వ్యాపారుల చేతుల్లో కూలిపోతున్నా అటవీశాఖాధికారులు పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పచ్చని చెట్లు నరికి లారీలు, టెంపోల్లో ట్రాక్టర్ల ద్వారా కలపను బెంగళూరు, తుమకూరు, మైసూరు, మధుగిరి, వసకెర తదితర ప్రాంతాలకు వ్యాపారులు పట్టపగలే తరలిస్తున్నా అటవీశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎడారి నివారణకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలు పెంచేందుకు ఉపాధిహామీ నీరు చెట్టు, వన సంరక్షణ సమితి తదితర ఎన్నో పథకాలకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తుంటే గుడిబండలో మాత్రం అందుకు విరుద్ధంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని కర్ణాటకకు కలప తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రాక్టర్ ద్వారా కలపను తరలిస్తున్న వ్యాపారులు

చర్యలు తీసుకుంటాం

నియోజకవర్గంలో పచ్చని చెట్లు నరికి కర్ణాటక ప్రాంతానికి తరలించే వ్యాపారస్తులపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతాం. ఎవరైనా చెట్లను నరికివేస్తే చర్యలు వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం.

-చాంప్లానాయక్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్


గోరంట్లలో బహుమతులతో విద్యార్థులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

సోమందేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను పాఠశాలల్లో నిర్వహించారు. విజేతలను ఎంపికచేశారు. కాగా గురువారం విజేతలకు ఆయా పాఠశాలల్లో బహుమతులు అందజేశారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలని వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


రొద్దంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం లక్ష్మీనరసమ్మ

భక్తిశ్రద్ధలతో కూష్మాండ దీపోత్సవం

ధర్మవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చక్ర వర్తి థియేటర్ సమీపంలో స్వయం భూ కాలభైరవస్వామి ఆలయంలో కూష్మాండ దీపోత్సవాన్ని గురువారం అర్చకులు ధనుంజయాచారి ఆధ్వర్యం లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అ నంతరం నిర్వహించిన అమావాస్య పూజలకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. అమావాస్య ఘడియల్లో ఆలయంలో పూజారి దోషనివారణ పూజలు చేశారు. అలాగే భైరవుడి ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలి గించారు. హిందూపురానికి చెందిన లోక్‌నాథ్ ,లావణ్య అన్నదానం ఏర్పా టు చేశారు.

మంత్రిని కలిసిన జనసేన నాయకులు


మంత్రితో జనసేన పార్టీ నాయకులు

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను హిందూపురం జనసేన పార్టీ నాయకులు కలిశారు. సత్యసాయిబాబా శతజయంతి వేడుకలకు వచ్చిన సందర్భంగా లేపాక్షి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పురం జనసేన ఇన్‌చార్జి ఆకుల ఉమేష్, చిలమత్తూరు మండల కన్వీనర్ చిన్నా ప్రవీణ్ నిమ్మకాయలరాము, శేఖర్, ఎల్‌ఐసి రమణ, డైరెక్టర్ శ్రీనివాసులు, చక్రి తదితరులు మంత్రిని కలిశారు.

80శాతం సబ్సిడీతో ఉలవల పంపిణీ

అగళి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 80 శాతం రాయితీతో గురువారం ఉలవలను పంపిణీ చేశారు. మండలానికి 250 క్వింటాళ్ల ఉలవలు వచ్చినట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. ఉలవల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రైతు సేవాకేంద్రాల్లో పంపిణీ జరుగుతుందని, 10కేజీల బస్తా ధర రూ.560కాగా రాయితీపోను రూ.112 చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తిప్పేస్వామి, సింగల్ విండో డైరెక్టర్ శివప్ప పాల్గొన్నారు.

ఆవాస్ యోజన ద్వారా అందరికీ ఇళ్లు

గోరంట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మండలంలో ఇళ్లు లేనివారికి ఇళ్లు నిర్మించే కార్యక్రమం చురుకుగా కొనసాగుతోంది. హౌసింగ్ సొంత స్థలం ఉండి, ప్రభుత్వం ద్వారా గృహం నిర్మించుకోవాలని ఆసక్తి ఉన్న వారిని అధికారులు, టీడీపీ నాయకులు గుర్తించి మార్కింగ్ ఇస్తున్నారు. పట్టణంలోని 4వార్డులో హౌసింగ్ అధికారులు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇంటి నిర్మాణంకోసం కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల విద్యాధరణీ, గిరిజధర్‌గౌడ్, అజంతుల్లా, నాగరాజు, కక్కుల రఘు పాల్గొన్నారు.

శుద్ధనీటి కేంద్రం ప్రారంభం



శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శుద్ధనీటి కేంద్రాన్ని మంత్రి సవిత గురువారం ప్రారంభించారు. తాగునీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొడిగెనహళ్లి పంచాయతీ టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి మిత్ర శుద్ధజల కేంద్రం యాజమాన్యంతో చర్చించి బిందునగర్ ప్రాథమిక పాఠశాల సమీపంలో నిర్మించగా మంత్రి ప్రారంభించి నీటిని అందించారు. దీని ద్వారా బిందునగర్, రాజేశ్వరిలేఅవుట్, సేవామందిరం తదితర ప్రాంతాలవారికి నీరు అందనుంది. ఒక్కొక్క శుద్ధనీటి కేంద్రానికి రూ. 3. 50 లక్షలు వ్యయం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు మండలవ్యాప్తంగా ఏడు శుద్ధనీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ శుద్ధనీటి కేంద్రాలకు మిత్రయాజమాన్యం నీటిని సరఫరా చేస్తుంది. తమ దాహార్తిని తీర్చినందుకు మంత్రికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల సందర్శన

సేవామందిరంలోని గురుకుల పాఠశాలను మంత్రి సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ... ఏదైనా ఇబ్బందులకు గురవుతున్నారా అంటూ ఆరాతీశారు. అనంతరం భోజన నాణ్యతను పరిశీలించారు. మంత్రి వెంట మిత్ర యాజమాన్య నిర్వాహకులు ఓబిలేసు, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, సర్పంచ్ బాలాజీ, ఎంఆర్ కాంట్రాక్టర్ మహేశ్వర్‌రావు, కొడిగెనహళ్లి సచివాలయ కన్వీనర్ గంగాధర్, వడ్డె హనుమయ్య, మారుతి, తిలక్, లోకేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చండి

మున్సిపల్ టీచర్ల సమాఖ్య నాయకులు


వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ టీచర్ల సమాఖ్య నాయకులు

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎంఈఓ గంగప్పకు మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత కూడా ఉందన్నారు. ఈ యేడాది పదోన్నతి పొందిన హెచ్‌ఎంలకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు గోవర్ధన్, జనార్దన్, బాలకృష్ణ, మురళికృష్ణ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు

మడకశిరటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి రోజు కావడంతో పట్టణంలోని దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. స్థానిక షిరిడీ సాయినాథుడి ఆలయంలోని బాణ లింగేశ్వరస్వామికి ద్రాక్ష, అన్నాభిషేకం నిర్వహించారు. షిరిడీసాయి నాథుడికి, భోగిరామలింగేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, అభయ, కావలికొండ, మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయాల్లో అమావాస్య సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి.


శివలింగానికి ప్రత్యేక అలంకరణ

● అమరాపురం: మండల పరిధిలోని విరుపసముద్రం గ్రామంలోని శివాలయంలో గురువారం కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శివలింగానికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. పూజల్లో ముఖ్య అతిథులుగా సహకార సంఘం అధ్యక్షులు గణేష్, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, ఎంపీటీసీ నగేష్, చంద్రశేఖర్‌గౌడ్, నిరంజన్, పంచాయతీటీడీపీ కన్వీనర్ నాగరాజు, మంజునాథ్ పూజల్లో పాల్గొన్నారు.

అకడమిక్ ఫోరం ఏర్పాటు

మడకశిరటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణల్లో భాగంగా మండల స్థాయిలో అకడమిక్ ఫోరంలను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా గురువారం మడకశిర మండలంలో అకడమిక్ ఫోరం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ తెలిపారు. టీమ్-1కు చైర్మన్‌గా భాస్కర్, సభ్యులుగా షీరిన్, విజయ్‌కుమార్, శివన్న, ప్రభాకర్, వెంకటరాముడు, మహేష్, మహేష్‌కృష్ణ, ప్రసాద్, వెంకటేష్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టీమ్-2 కింద కన్వీనర్‌గా నరసింహమూర్తి, సభ్యులుగా విశ్వనాథ్, కృష్ణమోహన్‌రెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసులు, రిజ్వానుల్లా, రమేష్, చంద్రమోహన్‌లను ఏర్పాటు చేసిందన్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు

పెనుకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ జయప్ప ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యసాయి భజనమండలి శంకర్, కేశవయ్య హాజరయ్యారు. ముందుగా బాబా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సత్యసాయిబాబా సేవా మార్గం చిరకాలం అనుసరణీయమన్నారు. ఆయన చేసిన చేసి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, అధ్యాపకులు హరీష్ బాబు, చంద్రమోహన్, దేవిశెట్టి రామన్న, ప్రతాప్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

హిందూపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగనగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఆలయంలో ఉన్న తలుపులు, హుండీ తాళాలు పగలకొట్టి అందులో ఉన్న సుమారు రూ.20వేలు నగదును ఎత్తుకెళ్లారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి: టీడీపీ

మడకశిర టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షులు నాగరాజు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని, ఉదయం 11 గంటల నుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా రెడ్డి ప్రకాశ్

గుడిబండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రెడ్డిప్రకాశ్ డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. ఈయన గుడిబండ పంచాయతీ కార్యదర్శిగా రెండేళ్లపాటు విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు సీనియారిటీ ప్రకారం పదోన్నతి కల్పించారు. త్వరలోనే డిప్యూటీ ఎంపీడీఓగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

